క్లుప్తంగా

సీతారామరాజుకు ఘన నివాళులు



అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి క్రైమ్: స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజుకు రాజు బుధవారం ఘన నివాళులర్పించారు. ఈ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఘన నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

రుయాలో...



నివాళులర్పిస్తున్న అధికారులు, వైద్యులు

తిరుపతి తుడా: స్థానిక రుయా, ఎస్వీ వైద్య కళాశాల ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి సీతా రామరాజు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుయా నూతన సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, ఎస్వీ వైద్యకళాశాల నూతన ప్రిన్సిపల్ డాక్టర్ రవిప్రభు సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు..

మూడంచెల విధానాన్ని పునరుద్ధరించాలి



తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం 117జీఓను రద్దు చేసి మూడంచెల విధానాన్ని పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్–1938 జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో తొమ్మిది రకాల స్కూళ్లను ప్రవేశ పెట్టడం ద్వారా గందరగోళం నెలకొందని, ఆదర్శ పాఠశాలల ఏర్పాటుతో దూరంగా ఉన్న స్కూళ్లను విలీనం చేయడం సమంజసం కాదని తెలిపారు. ఇదివరలా మూడంచెల విధానాన్ని పునరుద్ధరించడం ద్వారా ప్రభుత్వ విద్యారంగం బలోపేతం అవుతుందని, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

చేతిపంపునకు మరమ్మతులు



చేతి పంపునకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి తుడా: స్థానిక శివజ్యోతి నగర్ సాయిబాబా గుడి సమీపంలో చేతిపంపు బోరు మరమ్మతులకు గురవడంతో స్థానిక మహిళలు మంగళవారం నిరసనకు దిగారు. ఇదే విషయమై సాక్షిలో 'గుక్కెడు నీళ్లివ్వండి సామీ' అని కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన కమిషనర్ మౌర్య చేతిపంపునకు మరమ్మతులు చేయాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణను ఆదేశించారు. బుధవారం ఉదయం ఇంజినీరింగ్ సిబ్బంది చేతిపంపు బోరుకు మరమ్మతులు చేశారు. చేతిపంపు వల్ల పెద్దగా ప్రయోజనం లేదని, పవర్ బోరును బిగించాలని స్థానికులు డిమాండ్ చేశారు. దీనిపై గ్రీవెన్స్‌లో కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వాలని స్థానిక మహిళలు నిర్ణయించారు.

ఎస్వీయూ భద్రత పెరుమాళ్లకెరుక!

- వర్సిటీ శ్రీవారి ఆలయం ఎదుట శ్రీగంధం వృక్షం మాయం
- పనిచేయని సీసీ కెమెరాలు.. నిద్రావస్థలో సెక్యూరిటీ
- వర్సిటీలో మందుబాబులు, బయటి వ్యక్తుల హల్‌చల్
- వర్సిటీ నిర్వహణను గాలి కొదిలేశారంటున్న ఉద్యోగులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ తీరు మారలేదు.. వర్సిటీలో మందుబాబులు హల్‌చల్ చేస్తున్నా.. దొంగలు విచ్చలవిడిగా తమ పని కానిస్తున్నా.. బయట వ్యక్తులు వర్సిటీలో హాస్టళ్లు, పరిపాలనా భవనాలలో హల్‌చల్ చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి వర్సిటీలో శ్రీవారి ఆలయం ఎదుట ఏపుగా పెరిగిన శ్రీగంధం వృక్షాన్ని గుర్తుతెలియని వ్యక్తులు నరికివేసి దుంగను దోచుకెళ్లారు. వర్సిటీ ప్రధాన ద్వారం నుంచి పరిపాలనా భవనానికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న వృక్షాన్ని కొట్టేసి తీసుకెళ్తుంటే సెక్యూరిటీ కనీసం పట్టించుకోక పోవడం దారుణం. అసలు వర్సిటీలో భద్రత వ్యవస్థ నిద్యావస్థలో ఉందా ? అనే అనుమానం కలుగుతోంది.



ఎస్వీయూలో శ్రీవారి ఆలయ ఎదుట శ్రీగంధం చెట్టును నరికివేసిన దుండగులు



శ్రీగంధం వృక్షం కొనలను వదిలేసి దుంగను ఎత్తుకెళ్లిన దొంగలు

ఆలయ భద్రత ప్రశ్నార్థకమే !

ఎస్వీయూలోని ఎంతో ప్రాముఖ్యత కలిగిన శ్రీవారి ఆలయం భద్రత ప్రశ్నార్థకంగా మారింది. మంగళవారం ఆలయం ఎదుట రూ.లక్షలు విలువ చేసే శ్రీగంధం వృక్షాన్ని దోచుకెళ్లిన దుండగులు పక్కన ఉన్న ఆలయంలోకి వెళ్లింటే ఏంటి పరిస్థితి ? ఆలయంలో శ్రీవారి ఆభరణాలు, హుండీల భద్రత గాలికేనా అన్నట్లు తయారైంది. ఇంత తెగించిన దొంగలు భవిష్యత్తులో ఆలయంలోకి చొరబడరనే గ్యారంటీ ఏముంది ? వర్సిటీలో పాలన పూర్తిగా స్తంభించిపోయింది. అడిగే నాథుడు లేడు. వర్సిటీలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతోనే దుండగులు ఇష్టానుసారంగా వర్సిటీలోకి ప్రవేశిస్తున్నారు. ఇలానే కొనసాగితే వర్సిటీ మనుగడ కష్టసాధ్యమే. పాలకులు వర్సిటీని పట్టించుకోవడం మానేశారు.

– ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు

పల్లెల్లో జాతర.. ప్రతి ఇంటా సంబరం

- అమ్మవారికి సారె సమర్పించిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : గంగజాతరతో పల్లెలు పులకిస్తున్నాయి.. జాతరకు వచ్చిన జనంతో పల్లెలన్నీ సందడిగా కనిపించాయి. తిరుపతి గంగమ్మ జాతర చాటింపు రోజున తిరుపతి రూరల్ మండలంలోని గ్రామాల్లో జాతర నిర్వహించడం ఆనవాయితీ. పల్లెల్లో జాతర సందర్భంగా గత 12 ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీ ప్రకారం బుధవారం చెవిరెడ్డి కుమారులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి సారెను సమర్పించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు వారికి ఘన స్వాగతం పలికారు. కల్యాణ వెంకన్న ఆలయం నుంచి తెచ్చిన పసుపు, కుంకుమను జాతర నిర్వాహకులు సంతోషంగా స్వీకరించారు.

20 గ్రామాల్లో సారె సమర్పణ

చంద్రగిరి నియోజకవర్గ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బుధవారం ఉదయం 7గంటలకు పేరూరులో సారె సమర్పించారు. అనంతరం పెరుమాళ్లపల్లి, సి.మల్లవరం, గాంధీనగర్, పాతకాల్వ–1, 2, గొల్లపల్లి, రామానుజపల్లి, మల్లంగుంట, చిగురువాడ, వేదాంతపురం, అవిలాల గ్రామాల్లో సారెను సమర్పించి నడివీధి గంగమ్మలను దర్శించుకున్నారు. అలాగే వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సాయినగర్–1, 2 లింగేశ్వరనగర్–1, 2, కేసీపేట, అచ్చన్న ఇండ్లు, దుర్గసముద్రం, ఒడ్డిపల్లి గ్రామాల్లో సారెను సమర్పించారు. వారి వెంట ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డితో పాటు స్థానిక సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పార్టీ నేతలు హాజరయ్యారు.



గంగమ్మకు సారె తెచ్చిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పూర్తిపై సమీక్ష

తిరుపతి అర్బన్: స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ చైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనుల పురోగతిపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షితో కలసి సమావేశం నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటుకు అన్ని అనుమతులు మంజూరు చేశామని అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు సమన్వయం చేసుకుని గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ డిఫెన్స్ మాక్‌డ్రిల్

దేశంలో పౌర రక్షణ చర్యలను బలోపేతం చేసేలా కలెక్టర్లు జిల్లాలో భద్రతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు, రెవెన్యూ, భద్రతా, అత్యవసరసేవా, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం వెలగపూడి నుంచి సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్ అంశంపై సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి జిల్లా నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డీఆర్‌ఓ నరసింహులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులపై మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

కరెంట్ తీగలతో వేటాడితే చర్యలు

ఎర్రావారిపాళెం(చంద్రగిరి): విద్యుత్ తీగలతో వేటకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి రూరల్ ట్రాన్స్‌కో ఈఈ చిన్న రెడ్డెప్ప అన్నారు. మండలంలోని నెరబైలు విద్యుత్ సబ్ స్టేషన్‌లో బుధవారం రైతులతో విద్యుత్ చౌర్యంపై అవగాహన సమావేశం జరిపారు. ఆయన మాట్లాడుతూ ఎర్రావారిపాలెం మండలం దట్టమైన అటవీ సరిహద్దులో ఉందన్నారు. మండలంలో 12 ఫీడర్ల ద్వారా సుమారు 150 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్లతో 1976 వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు కలిగి ఉన్నాయన్నారు. ఇంత పెద్ద పరిధి ఉన్న మండలంలో భౌగోళిక రీత్యా అటవీ ప్రాంతం కావడం వల్ల కాపలా ఉండడం కష్టం అని, దీంతో కొంతమంది నేరస్తులు కరెంట్ తీగలతో వన్య ప్రాణుల వేటకు పాల్పడుతున్నట్లు తెలిసిందన్నారు. రైతులు తమ పొలాల వద్ద అనుమానాస్పదంగా తిరుగాడే వ్యక్తుల సమాచారాన్ని అందించాలని కోరారు. సమావేశంలో ఏఈలు రమేష్ బాబు, జ్యోతిప్రసాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ అధికారులు

జాగ్రత్తలతో వడదెబ్బకు చెక్

చంద్రగిరి: వేసవిలో సరైన జాగ్రత్తలు పాటించడం ద్వారా వడదెబ్బ తగలకుండా సురక్షితంగా ఉండవచ్చని జిల్లా డిప్యూటీ డెమో అధికారి కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కావమ్మ గుడి సమీపంలో వడదెబ్బ, పోషకాహారం, వ్యక్తిగత శుభ్రత తదితర విషయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వేసవిలో రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగవద్దన్నారు. తప్పనిసరిగా బయటికి వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, తలపాగా వంటివి తలకు రక్షణగా ధరించాలని తెలిపారు. మంచి నీళ్లు, ఉప్పు కలిపిన మజ్జిగ, ఓఆర్‌ఎస్ ద్రావణం వంటివి అధికంగా తీసుకోవాలన్నారు. అలాగే మాంసాహారం తగ్గించి శాఖాహారం అధికంగా తీసుకోవాలని సూచించారు. పుచ్చ, దోసకాయలు శరీరానికి చలువ చేస్తాయని, పండ్ల రసాలు తీసుకుంటే మంచిదన్నారు. నీరసం, కళ్లు తిరగడం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు ఉంటే వారిని చల్లటి ప్రదేశంలో ఉంచి ప్రథమ చికిత్స అందించాలని, తరువాత దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలని తెలిపారు. కార్యక్రమంలో 104 వైద్యాధికారి డాక్టర్ శిరీష, హెల్త్ సూపర్‌వైజర్ శ్యామల, గుర్రమ్మ, వెంకటరమణ, పావని, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డెమో అధికారి కిరణ్ కుమార్

కోచింగ్ సెంటర్ పేరిట ఇంటర్ తరగతులు

తిరుపతి ఎడ్యుకేషన్ : కోచింగ్ సెంటర్ల పేరిట ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నా.. సంబంధిత ఇంటర్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి తెలిపారు. తిరుపతి బైరాగిపట్టిడలోని బన్సల్ కోచింగ్ సెంటర్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత విద్యాసంవత్సరంలో కోచింగ్ సెంటర్ పేరిట ఇంటర్ తరగతులు నిర్వహించి ఆఖరికి 70 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షను రాయలేక తమ విలువైన సమయాన్ని కోల్పోయారని గుర్తు చేశారు. అయినా అధికారుల్లో విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఇలాంటి కోచింగ్ సెంటర్లపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆర్ఐఓ కార్యాలయ ముట్టడి చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, నాయకులు హరికృష్ణ, ఓంరాజు, సాధిక్ బాబు, జగదీష్, రంజిత్, సుబ్బు, విష్ణు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ముగిసిన స్టార్ స్పీకర్ కాంటెస్ట్–2025

తిరుపతి తుడా: ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ మొట్టమొదటిసారిగా తన ఇంపాక్ట్ క్లబ్ సభ్యులకు, ట్రైనర్స్‌కు దేశవ్యాప్తంగా రీజనల్ లెవెల్ ఆన్‌లైన్ స్టార్ స్పీకర్ కాంటెస్ట్ నిర్వహించింది. ఆ సంస్థ ఆర్గనైజర్ తహసున్నీసా బేగం మాట్లాడుతూ తిరుపతి రీజియన్‌కు చెందిన స్టార్ స్పీకర్లు నయాబ్ షైమా, మునీంద్ర, అశ్విని, రమ్యశ్రీ, రమణ, లక్ష్మీప్రసాద్, కట్టారు శ్రీనివాసులు విజేతలుగా నిలిచారని తెలిపారు. ఈ పోటీల్లో 39 మందిలో 7 గురు రీజనల్ లెవెల్‌లో స్టార్ స్పీకర్ విజేతలుగా నిలిచారన్నారు.

సీహెచ్ఓల వినూత్న నిరసన

తిరుపతి తుడా : మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. బుధవారం ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం వద్ద సీహెచ్ఓలు మోకాళ్ల కూర్చుని వినూత్న నిరసనకు దిగారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ కాళీమాత రూపంలో నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈపీఎఫ్ఓ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమ్మె కారణంగా గ్రామీణ వైద్యం స్తంభించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ఏపీపీఎస్సీ పరీక్షలు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 911 మంది అభ్యర్థులకు గాను 610 మంది మాత్రమే హాజరైనట్లు వెల్లడించారు. 301 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వేసవి నేపథ్యంలో అభ్యర్థులు ఇబ్బంది పడకుండా పకడ్బందీగా వసతులు కల్పించినట్లు వివరించారు.

బాధ్యతల స్వీకరణ



మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ రవిప్రభు




రుయా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ రాధ

తిరుపతి తుడా: శ్రీ వేంకటేశ్వర మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ రవిప్రభు, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రుయా సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ రవిప్రభును మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా, అలాగే అక్కడ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్‌గా ఉన్న డాక్టర్ రాధను రుయా సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఇరువురు ఒకరి నుంచి మరొకరు బాధ్యతలు స్వీకరించారు. పలువురు అధికారులు, సిబ్బంది వీరికి అభినందనలు తెలిపారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ కళాశాల టీచింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ రాంబాబు నాయక్, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ వినోద్‌కుమార్, జనరల్ సెక్రటరీగా లక్ష్మీకవిత, జాయింట్ సెక్రటరీగా నవీన్, ట్రెజరర్‌గా శివకుమార్, సభ్యులుగా మరో ఐదుగురు ఎంపికయ్యారు. ఎంపికైన కార్యవర్గం రెండేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య ఎంపికైన నూతన కార్యవర్గాన్ని సత్కరించారు.



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య

అంబలి పంపిణీ

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారి నగరంలో భక్తులకు అంబలి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, సభ్యులు పాల్గొన్నారు. కార్పొరేషన్ కూడలిలోని పటేల్ ఫ్లైవుడ్స్ వద్ద భక్తులకు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో అంబలి వితరణ చేశారు. అలాగే పూల మొక్కలను అందజేశారు. మూగజీవులకు దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లు, కూలీలకు టోపీలు అందజేశారు. రోటరీక్లబ్ జోన్ గవర్నర్ హేమచందర్ సభ్యులు పాల్గొన్నారు.

వాసవి కనక్యకా పరమేశ్వరికి పూజలు



అనుగ్రహ భాషణం చేస్తున్న రమ్యానంద భారతి స్వామి

తిరుపతి కల్చరల్: నగరంలోని కొత్తవీధిలో వెలసిన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం అమ్మవారి జయంతి ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు శ్రీశక్తిపీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామి విచ్చేసి అమ్మవారికి వజ్రాలతో పొదిగిన తిలకం బొట్టు, సారె సమర్పించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఊరేగింపు వేడుకగా సాగింది. ఈ సందర్భంగా 416 మంది ఆర్య వైశ్య మహిళా మణులచే త్రిశక్తి స్వరూపిణి అయిన అమ్మవారికి సర్వదేవతా సమ్మోహన హారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. అలాగే తిరుచానూరులో వాసవీ అమ్మవారి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీ పద్మావతి ఆర్య వైశ్య నిత్యాన్నదాన సేవా సమాజం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చంద్రగిరి: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై పనపాకం టోల్‌ప్లాజా వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. పాకాల మండలం పోలిరెడ్డిపల్లెకు చెందిన సాయికిరణ్ ద్విచక్ర వాహనంపై వెళుతూ..తిరుపతి నుంచి పుంగనూరు వైపు వస్తున్న బస్సును ఢీకొన్నాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు.

నోటీస్ బోర్డు

- తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా బండ వేషాలలో అమ్మవారిని దర్శించుకోనున్న భక్తులు
- సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సమావేశం, సాయంత్రం 4 గంటలకు ఎంఎస్ సుబ్బులక్ష్మి విగ్రహం నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ, అనంతరం 5 గంటలకు బహిరంగ సభ
- భవానినగర్‌లోని గీతం స్కూల్లో ఉదయం 8 గంటలకు మెగా జాబ్ మేళా
- తిరుపతి నార్త్ సెక్షన్, 33/11కేవీ ద్వారకనగర్ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఎన్‌జీవో కాలనీ, రామచంద్రనగర్, ద్వారక నగర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం
- అన్నమాచార్య కళామందిరంలో సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పంచ సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్‌చే 'విరాటపర్వం'పై ప్రసంగం

ఉగ్రవాదం అంతరించాలి

తిరుపతి అర్బన్: ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్‌లోని ఉగ్రవాదులను అంతరించడంలో ఇండియన్ ఆర్మీ ధైర్యసాహసాలకు సెల్యూట్ చేస్తున్నామని కాంగ్రెస్‌పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు చిట్టిబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులు కశ్మీర్‌లోని పహల్గాంలో భారతీయులపై చేసిన దాడుల్లో మృతిచెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరేలా భారత్ సైన్యం దాడులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. తాము భారత సైన్యానికి పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు.

ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉండాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : యూటీఎఫ్ నాయకులుగా ఎదుగుతున్న కార్యకర్తలంతా ఉపాధ్యాయులకు మార్గదర్శకులుగా ఉంటూ, వృత్తి, సర్వీసుపరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాస రావు తెలిపారు. తిరుపతిలోని యూటీఎఫ్ భవన్‌లో బుధవారం నిర్వహించిన యూటీఎఫ్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. యూటీఎఫ్ ఆవిర్భావ, ఉద్యమ చరిత్రను తెలుసుకోవడం, సామాజిక, విద్యారంగంలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను నిశితంగా పరిశీలిస్తూ విద్యారంగాన్ని సరైన దారిలో నడిపించేందుకు యూటీఎఫ్ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లలోని పేద పిల్లల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేలా బోధన సాగాలని, అందుకోసం యూటీఎఫ్ కార్యకర్తలు తగిన శిక్షణ తీసుకోవాలన్నారు. శిక్షణా కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీకే రాజశేఖర్, ముత్యాలరెడ్డి, నాయకులు దేవరాల నిర్మల, రామచంద్రయ్య, కుమారస్వామి, గీతమ్మ, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

తిరుపతి తుడా: వైద్య ఆరోగ్యశాఖలోని సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఏపీ హంస అసోసియేషన్ నాయకులు బుధవారం వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. జిల్లా పర్యటనలో భాగంగా తిరుపతికి విచ్చేసిన ఆయనను హంస జిల్లా అధ్యక్షుడు రాజా ఆధ్వర్యంలో సభ్యులు కలిశారు. ఉద్యోగుల సమస్యలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సమస్యలు, వేతనాలు, అలవెన్స్‌ల విషయంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఇమ్రాన్, సభ్యులు పాల్గొన్నారు.